ఓటు హక్కు వజ్రాయుధం

- గ్రామాల్లో పోలీస్ ప్రత్యేక బలగాలతో ర్యాలీ
- అదనపు ఎస్పీ నాగేంద్రుడు


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీస్ బలగాలు

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ నాగేంద్రుడు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం సమస్యాత్మక గ్రామాలైన గుండుమాల్, బలభద్రాయపల్లి గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనో ధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులుతోపాటు ఆర్ఎఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..


పేటలో కాంగ్రెస్‌లో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి


మాగనూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలతో కాంగ్రెస్ మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు బుధవారం సీవీఆర్ భవన్‌లో మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ సారి కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అలాగే మండలంలోని చిన్నజట్రంలో బుధవారం బోయ విష్ణు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 200మంది కాంగ్రెస్‌లో చేరడంతో వారికి ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాస్, నరేందర్, అశోక్, రామకృష్ణ, నారాయణ, సతీష్ ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో సుధాకర్, కోణంగేరి హన్మంతు, కౌన్సిలర్ సలీం, బోయ శరణప్ప, శ్యాంగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: బుధవారం పట్టణంలోని మక్తల్‌కు చెందిన వార్డు సభ్యుడు నర్సింహులుగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నుంచి 150మంది కార్యకర్తలు వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మక్తల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామానికి చెందిన 40మంది కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తాము స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నామని తెలపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు నర్సింహులు, మొగ్గలప్ప, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో భజన మండలి



మరికల్: మండలంలోని పల్లెగడ్డ, అమరచింత మండల చిన్నకడ్మూర్ భజన మండలి సభ్యులు శ్రీవారి సేవలో అఖండ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం నుంచి వారంరోజుల పాటు తిరుమల, తిరుపతి దేవస్థానంలో జరిగే వివిధ సేవ కార్యక్రమాల్లో వీరు పాల్గొని సేవలు చేయనున్నారని టీటీడీ జిల్లా ముఖ్య కార్యనిర్వాహక ప్రచార సభ్యులు శ్రీరాం తెలిపారు. అలాగే స్వామివారి సన్నిధిలో వారంరోజుల పాటు అఖండ భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

భవన నిర్మాణపనులు పూర్తిచేయాలి

మరికల్: కస్తుర్బా పాఠశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు కొండయ్య, బాల్‌రాజ్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత రెండేళ్ల నుంచి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ధన్వాడ కస్తుర్బాలో కొనసాగుతున్న మరికల్ పాఠశాల విద్యార్థులు గదుల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మరికల్: ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ బలపర్చిన పర్ణికారెడ్డిని గెలిపించుకోవాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా చెప్పిన ఆరు గ్యారెంటీ పథకాలను నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, విజయ్‌కుమార్ రెడ్డి, మొగులప్ప, నరహరి, రాజు, మల్లేష్, అంజిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధన్వాడ: కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రతి కార్యకర్త నేటి నుంచి గ్రామాల్లో ఇంటింటికీ కాంగ్రెస్ అందించే పథకాల వివరాలను వివరించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నుంచి 600మంది కాంగ్రెస్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరి, విరన్న, ఉపాధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి దమోదర్‌రెడ్డి, సూదర్శన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, బాలకృష్ణ, కృష్ణయ్య, లక్ష్మయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, సుర్యప్రకాష్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



మక్తల్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ బీమా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వందమంది రోగులకు చికిత్సలు నిర్వహించగా వారిలో 60మంది కంటి సమస్య ఉన్నవారికి ఆపరేషన్ కోసం ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. శిబిరంలో కంటిపరీక్షలుచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబాదాస్, నాగరాజు, శ్రీనివాసులు, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, పృథ్వీరాజ్, శరణప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

ఆత్మకూర్: నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు, పాలు పంపిణీ చేశబూరు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, శ్రీను, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, గంగాధర్, వెంకటన్న, జుబేర్, అక్బర్, శంషీర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక..


నారాయణపేటలో కండువాలు పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి

నారాయణపేట/ధన్వాడ: ధన్వాడకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరడంతో బుధవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గువ్వలపల్లి బాలకృష్ణ,నీరటి బాబా ముదిరాజ్, లక్ష్మయ్య ముదిరాజ్, దండు పాపన్న, దండు లక్ష్మన్న, నీరటి బాలప్ప, సుధాకర్, పవన్‌లు ఉన్నారు. అదేవిధంగా బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ చౌహన్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఎం రాజు, ఉదయ్‌తో పాటు పలువురు ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల నాయకులు అంజియాదవ్, లక్ష్మారెడ్డి, నాగిరెడ్డి, చందర్‌కుమార్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన కొందరు ఇతర పార్టీల నాయకులు బుధవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మండల అధ్యక్షుడు తిరుపతయ్య బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరిష్‌రెడ్డి, శేఖర్, బసంత్, రామాస్వామి, రాజేష్, గోపి, కమల్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధే గెలిపిస్తుంది..



నర్వ: మక్తల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులే ఎన్నికల్లో గెలిపిస్తాయని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్‌లో ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి 20మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములుశెట్టి, విండో వైస్ చైర్మెన్ లక్ష్మన్న, ఎంపీటీసీ పద్మమ్మ, సర్పంచ్ అరవింద్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, మండ్ల చిన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ప్రేరణ తరగతులు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 10గంటలకు వారియర్స్ డిఫెన్స్ అకాడమీ లయన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా, ఉద్యోగం, లక్ష్యం, ఆర్థిక అంశాలపై ద మిషన్ ఫౌండర్ కొట్టె ఏడు కొండలు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాసర్‌దొడ్డిలో బీఎస్పీ ప్రచారం



మక్తల్: మండలంలోని దాసర్‌దొడ్డిలో నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈమేరకు గ్రామంలో యువకులు, కార్యకర్తలు వారిని శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. వివిధపార్టీల నుంచి యువకుల, కార్యకర్తలు వర్కటం జగన్నాథ్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో అంజానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర పెంచాలని రైతుల ఆందోళన


కాటన్ మిల్లు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఊట్కూరు: మండలంలోని గ్రామశివారులో విజయ కాటన్ మిల్లు వద్ద బుధవారం పత్తిధర పెంచాలని రైతులు ఆందోళ చేపట్టారు. ఇతర ప్రాంతాల కంటె ఈ పత్తి మిల్లులో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని సుమారు 200మంది రైతులు గేటు వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న గోకరి మిల్లు దగ్గరకు వచ్చి రైతులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించడంతో రాయిచూరు, మల్లెపల్లి, కొల్లంపల్లి గ్రామాల పత్తి మిల్లులకు, వాటి యజమానులకు ఎస్ఐ పోన్‌చేసి కొనుగోలు ధరలు తెలుసుకున్నాడు. వివిధ ప్రాంతాలలో రూ. 6500 నుంచి 7330 ధర క్వింటాల్‌కు కొనుగోలు చేస్తున్నారని, ఇక్కడ కూడా ఇదేరకు కొనుగోలు చేయాలని యజమానులకు చెప్పడంతో రైతులు శాంతించారు.

ఘనంగా వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు


మక్తల్‌లో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: పట్టణంలోని అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరిదంపతులు పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని ముస్టిపల్లిలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, వైస్ ఎంపీపీ రామేశ్వరి, కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కావలి తాయప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, హన్మంతు, గణేష్ కుమార్, మెకానిక్ నందు, అజయ్‌కుమార్, నాగేందర్, వెంకట్‌రెడ్డి, నర్సింహులు, దామోదర్. శ్రీరాంమూర్తి, వెంకట్‌రాములు, రవి, గొల్లపల్లి నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలో బుధవారం అసెంబ్లీ అభ్యర్థి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె సురేష్, తిమ్మప్ప, శివ, వలి, సబ్దర్ అలీ, బాబు, ఆసీఫ్, సిద్దు, వీరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చేతుల మీదుగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నీరజ్, శరణప్ప, వివేక్‌వర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, సంజీవారెడ్డి, రవిసాగర్, అశోక్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా భవనం

మాగనూర్: గృహనిర్మాణ సంస్థ సహాయక ఇంజనీర్ కార్యాలయం భవనం నిరుపయోగకరంగా మారింది. గతంలో గృహనిర్మాణలకు సంబంధించిన శాఖ అవసరాల నిమిత్తం భవనాన్ని నిర్మించగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ శాఖ అధికారులను ఇతర శాఖలో కల్పివేయడంతో భవనం నిరుపయోగంగా మారింది. మండలంలో వివిధ అవసరాలకు భవనాల కొరత ఉందని, ఇతర శాఖల అధికారులకు కేటాయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం


పేటలో ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి

నారాయణపేట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 12, 13వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఇంటింటి ప్రచారం చేసి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ మొనటి జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటువేయాలని చిట్టెం సుచిరత రామ్మోహన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని క్షీరాలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీపీ పూర్ణిమ పాటీల్, సర్పంచ్ రాధ, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అనుసూయమ్మ,శివరాజ్‌పాటీల్, మోనేష్, శివప్ప, అంబ్రేష్, అశోక్‌గౌడ్, శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాగనూర్: బుధవారం మక్తల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని కొత్తపల్లి, గురువలింగంపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. జెడ్పీటీసీ వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు, పల్లెమారెప్ప, రవి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డిని మరొకసారి గెలిపించాలని మండల ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మందిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గోవింద్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


దామరగిద్దలో ఇంటింటి ప్రచారంలో నాయకులు

దామరగిద్ద: కారుగుర్తుకు ఓటేసి అభివృద్ధికి బాటలు వేద్దామని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మూల్యాంకన గౌరవభృతి చెల్లించాలి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: గత విద్యా సంవత్సరం చివర (మార్చ్ 2023)లో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన వార్షిక పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులు చేపట్టిన మూల్యాంకనానికి సంబంధించిన గౌరవబృతిని వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, రెడ్డప్ప డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ అబ్దుల్ ఘనిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నారాయణపేట నుంచి ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌కు ప్రతిరోజు వెళ్లిరావడం, తద్వారా రవాణా ఖర్చులు, భోజన ఖర్చులు సొంతంగా పెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఆ నిధులు మంజూరు చేయకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ టీఏ, డీఏలకు సంబంధించిన నిధులు అందించాలని కోరారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమించొద్దు


ఆత్మకూర్‌లో వాహనం తనిఖీ చేస్తున్న సీఐ రత్నం, ఎస్ నరేందర్

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో స్పెషల్ బెటాలియన్ పోలీసులు బుధవారం స్థానిక గాంధీచౌక్, చెరువు కట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్


అమరచింతలో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఎస్ఐ జగన్మోహన్

అమరచింత: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆదేశాలతో గ్రామాలు, పట్టణాల్లో ఐటీబీపీ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని సీఐ రత్నం తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ప్రధాన రహదారుల వెంట పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలను శాంతియుత వాతవారణంలో నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ముమ్మరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్మోహన్, ఏఎస్ఐ జమీరుద్దీన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు..

నర్వ: మండలంలోని ప్రధాన రహదారుల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక పక్క మలుపుల రోడ్డు, మరోపక్క వాహనాల అతివేగంతో ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి రాంపూర్ గేట్ వరకు ఉన్న రహదారిపై వివిధ మలుపులున్నప్పటికీ అక్కడ పంచాయతీరాజ్ అధికారులు ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంకాల్ చెరువుకట్ట మలుపు వద్ద, నర్వ, లంకాల్ మధ్యన బోర్డులను ఏర్పాటుచేస్తే ప్రమాదాలను నివారించొచ్చని, అధికారులు దృష్టిసారించి బోర్డులు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లలో పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వేలాది మంది భక్తుల సమక్షంలో పాండురంగస్వామి, రుక్మిణీమాత కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి ఆభరణాల ఊరేగింపు, పల్లకీసేవ, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. అలాగే గురువారం స్వామివారి రథోత్సవం, మహామంగళహారతి, ప్రసాద వితరణ , పూజా కార్యక్రమాలను చేపడుతున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు శ్రీధర్‌జోషి, నిర్వాహకులు కోరారు.

కూలీ లేక.. రైతుల బేజారు


పత్తి తీస్తున్న కూలీలు


ఆటోలో వెళుతున్న కూలీలు

- ఒక్కో కూలీకి రూ.350
- ఆందోళనలో పత్తి రైతులు

మరికల్: ఈ ఏడాది పత్తి పంటలో ఆశించిన దిగుబడి లేక పరషాన్‌లో ఉన్న రైతులకు కూలీల కొరత పెద్ద సమస్య వచ్చి పడింది. ఉన్న కాస్త పత్తిని తీయించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సొంత గ్రామాల్లో కూలీలు దొరకపోవడంతో ఇతర గ్రామాలకు వెళ్లి ఎడ్లబండ్లు, ఆటోలపై కూలీలను తీసుకొచ్చి పత్తిని తీయిస్తున్నారు. దీంతో ఒక్కొక్క కూలీ రూ. 350, ఆటో కిరాయి రూ. 60 పలకడంతో ఒక కూలీ వెంబడి రూ. 410 పడుతుంది. కూలీల రేట్లు అమాంతం పెరగడంతో పత్తి రైతులు బేంబేలేత్తున్నారు. ఇప్పటికే పంటలకు పెట్టిన పెట్టుబడులు రాక పీకల్లోతు అప్పులో కురుకపోయిన పత్తి రైతులకు కూలీల డిమాండ్‌తో ఆందోళనలో పడుతున్నారు.